

## శ్రీ మల్లాది వేంకటకృష్ణశర్మ

చిన్నగది గదిలో రెండు దేవదారు ఆల్మైగాలు, వాటిలో దట్టంగా పుస్తకాలు బూజు పట్టి వుంటాయి. గోనెకుట్టిన ఈజీచైరు, దిగువ చింకి చాప, గదంతా కాగితం ముక్కలతోనూ తొక్కలతోనూ, నిండివుంటుంది. సింహాచలం ఈ జీచైర్లో కూచొని ఉంటాడు. తొడమీద చాంబర్సు డిక్షనరీ, చేతిలో టైమ్సుఆఫ్ ఇండియా పత్రికలోని క్రాస్‌వర్డ్ పజల్ తాలూకు కాకితం ఉంటుంది తీవ్రంగా ఆలోచిస్తూ వుంటాడు. గదికిముందు చావడివుంది. చావడి కాస్త విశాలంగా వుంటుంది.

సుందరమ్మకు 20, సంవత్సరముల వయస్సు సొగకళ్ళు, చిరుతవాటు మొహం, దంతపు వన్నె శరీరం, చాలా నాజూకుగా ఉంటుంది. ఆమె పెరటిద్వారం నుండి చావడిలోకి వచ్చి గదితలుపు తోస్తుంది. లోపల గడియపెట్టినట్టు గ్రహించి

సుంద —అప్పుడే సారె పెళ్లికూతురు లాగ తలుపు గడియపెట్టేశారూ ?

సింహా.—దీని సణుగు నంచి నా పజల్సన్నీ పాడయి పోతున్నాయి.

సుంద —వల్లకాటి పజిల్సు. సవితిలాగ నాపాలిట బాగా వచ్చాయి, సొమ్మొదండుగ, ఏనాడూ ఇచ్చు కానీ వచ్చిన పాపాన పోలేదు. ఇంట్లో కూరలేదు, పప్పులేదు, ఉప్పులేదు, ఒక సారి బజారు కెళతారా ?

సింహా.—నా కివ్వాళ చావడానికి కుడా తీరుబడిలేదు. ఇవాళ వంటమానేయ్.

సుంద·—అంతగా వస్తే మరి వండెందుకు, పోనీ తలుపు తియ్యండి నా గుడ్డలు పట్టుకొని నేను మావాళ్ళింటికి పోతాను.

సింహా—నేను చాలా ఆలోచనలో ఉన్నాను, తలుపు తియ్యను.

సుంద:—తలుపు తీసినంత మాత్రంచేత మీ ఆలోచన ఇవతలకు దూకదులెండి. కాస్త తియ్యండి.

సింహా:—తియ్యనోయ్ అంటే నీకు మతి లేదూ.

సుంద:—ఇదేమిటి ? రెండు రోజులనుంచీ తలుపులు మూసుకొని కూచోడం ప్రారంభించారు. అంతకంతకు వెఱ్ఱి ముదురుతూ వుంది. ఆయింటిగల ఆయన అద్దెకోసం నానా అల్లరీ చేస్తున్నాడు. ఇల్లు అయ్యవారి నట్టిల్లులాగుంది. ఇహ నేనా ఆ పజిల్సుకి కట్టడం మానకూడదూ! ప్రతీనెలా పది పన్నెండు రూపాయిలు ఎంట్రీల

కని పదిమంది పేరకడతారు. ఎందుకు వచ్చిన ఖర్చు. వాడు పెద్దఅక్షరాల్లో డెబ్బయివేల రూపాయిలు, అని వ్రాయగానే, మీకు మతి పోతుంది కదూ! ఈ పూళ్ళో ఒకడికి 70 దమ్మిడీ లైనా వచ్చినట్టు లేదు...ఔనండీ, మనలో మాట మీరు మరిచిపోయి పొరబాటున ఒక పజిల్ రైటుగా ఆన్సర్ చేస్తా రనుకోనండి. మీరు అనుకున్న 70,000 రూపాయిలూ మీకు పంపించేస్తా రనుకోనండి. ఆ సొమ్ముతో మీరు ఏం జేస్తారు.

సింహా—డబ్బున్న వాళ్ళంతా ఏం జేస్తున్నారో నేనూ అదే చేస్తాను.

సుంద—డబ్బున్నవాళ్లు ఏం జేస్తున్నారు? బస్సు సర్వీస్ పెట్టి, దివాలా తీస్తున్నారు. ఓట్ల కింద ఖర్చుపెట్టి ఓడిపోతున్నారు. టిన్‌హాళ్ళలో జూదాలాడి పీగిపోతున్నారు. తాగి దొర్లుతున్నారు. భోగం తొత్తులతో ఊరేగుతున్నారు.

సింహా.—నేనూ అదే చేస్తాను.

సుంద.—భోగం ముండల్ని ఉంచుకుంటా రన్నమాట.

సింహా.—ఓ యస్ గా...

సుంద.— తాగుతారా - జూదం...

సింహా.—జూదం త్రాగుడు - ముండ - ఇవన్నీ అవసరమే - నా గోల నీకెందుకు? నీ నించి నా పజిల్సు అన్నీ ధ్వంసం అవుతున్నాయి- మీ అమ్మమ్మది అంత జాతకం ఇంత జాతకం అని చెప్పేరు. అంచౌను కాబోలును అనుకొని దానిపేర నాలుగు ఎంట్రీలు కట్టాను. ఒహపైనా వచ్చునూ? ఇంతకీ నాబుద్ధి తక్కువ కాకపోతే, బోడిముండకు అదృష్టం యేమిటి!

సుంద.—అయితే గెలవనివాళ్ళంతా ఎవరు? బోడి ... (నోరునొక్కుకొని) నాకెందుకు... తలుపు తీస్తారా తియ్యరా?

సింహా.—ఇవాళ నువ్వు నెత్తి బద్దలుచేసుకొని చచ్చినా తలుపు తియ్యను. నన్ను మాట్లాడించకు. ఇంక నీకీ గదినుండి జవాబురాదు.

సుంద—ఇంత మొండితనం ఏమిటి చెప్మా! ఇంట్లో పెళ్ళాం వున్నాదంటే ఎంత దీనిగా ఉంటారు. మీలాంటివాడే కద! అతను పొరుగున. ఈ గొప్ప పజల్సు మీకే కాని మరెవరికీ లేదు కాబోలు. ఉన్నది అమ్మియిలాగ వాళ్ల ఎదాన పొయ్యడం - ఛీ, మనిషైపుట్టాక కాస్త జ్ఞానం వుండాలి.

సింహా:—(నిస్పృహతో) ఆహా! దేవుడా ఇదెక్కడి పెళ్లాం దొరికిందిరా, చంపుతున్నాది! నాకు ఒక్కమాటలో ఈ పజిల్ అల్లరి పెడుతున్నాదే మహాప్రభూ! కాస్త నోరుమూసుకొని యింటో కూచోవే అంటే వినదుకద!

సుంద.—మీకు నాబాధ అంత యెక్కువగా ఉంటే తలుపు తీసి నా చీరలు నాకు పారెయ్యండి పోతాను.

సింహా.—నే నివాళ తలుపుతీస్తే బ్రాహ్మణ్ణి కాను.

సుంద—నేనివాళ మీచేత తలుపు తీయించక పోతే చిన్న వెంకన్న కూతుర్ని కాను - చూడండి తమాషా.

సింహా:—(నిట్టూర్చి ఈ జీవైరుకు చారబడతాడు)

సుంద:—(పెరటితలుపు గడియవేసి వీధి ద్వారం ఓరగామూసి తలుపు ముందుకువచ్చి) ఏం...తలుపు తియ్యరూ.

సింహా —చెప్పేనుగా . మరి ఈ గదిలోంచి నీకు జవాబు రాదనీ.

సుంద.—సిగ్గూ లజ్జా వుండాలి. కట్టుకున్న భార్యని ఇలాగ దుఃఖపెట్టడం భావ్యం కాదన్న ఆలోచనలేని మనిషి దున్నపోతుతో సమానం.

సింహా —పోనీ నేను దున్నపోతుని, ఆవుని, గొడ్డుని - సరా - వెళ్ళు • తలుపు తియ్యను. మరి ఈ గదిలోంచి జవాబివ్వను.

సుంద:—మీరు తలుపు తియ్యక పోవడానికి ఏదో పెద్దకారణం వుండాలి. మీ గదిలో ఎవరో ఆడది దూరినట్టు అనుమానంగా ఉంది. తలుపు తీస్తారా నలుగుర్నీ పిలిచి తగువుపెట్ట మన్నారా?

సింహా·—నాయిష్టం - నేను పబ్లిక్ మొగాణ్ణి నాయిష్టం వొచ్చిన ఆడదాన్ని తెచ్చుకుంటాను.

సుంద:—పోనీ కళ్ళకల భాగ్యం. తలుపు తియ్యండి. ఇద్దర్నీ చూస్తాను.

సింహా —(ఎవరినో యింకోమనిషిని అడుగుతూ వున్నట్టు) చూస్తే భయం ఏమిటి తలుపు తీద్దునా?.. భయంలేదు ....ఆమె ఏమేనా అంటే నేనున్నాగా (గొంతుమార్చి చమత్కారంగా అతి సహజంగా స్త్రీ వలె) అబ్బ... ఒద్దు...మీ పెళ్లాం మంచిదికాదు. (జేబులో కాన్లు గాజులవలె చప్పుడు చేస్తూ) తీస్తూంటే చేతులు పట్టుకొని ఎలాగ లాగేస్తూందో చూడు - ఆమె అనుజ్ఞ లేందే తలుపు తియ్యనుపో.

సుంద.—(ఆత్రముతో) ఏమిటి! నిజమే - కల కాదు కద! ఏమిటి. ప్రాలుద్దం ..ఆ గాజుల చప్పుడు స్పష్టంగా వినిపిస్తూ వుంటే ఇన్నాళ్ళూ ఏమిటో అనుకున్నాను. పజిల్సు అని కొన్నాళ్ళు రాత్రిళ్లు ఇంటికి రాకపోవడం - తరవాత ఇలాగ సంసారి కొంప సానికొంప చెయ్యడం - అయ్యో పట్టపగలు, దీనికెంత సిగ్గులేదో !

సింహా —(స్త్రీ కరంతో) ఎందుకు చెప్పే శారండీ మీ భార్య పిశాచం లాటిది. (సహజంగా) చెబితే మాత్రం నిన్నది చేసేదేమిటి ?

సుంద.—చూశారా! చూశారా? దారుణం. ఆ ముండని నేనేం చెయ్యగలనా ? దానిముందు నన్నలాగ అంటే, నాదగ్గిర దానికేమేనా భయం, భక్తీ వుంటుందీ···నాకు మీరు తలుపు తియ్యడం కాదు, ఇద్దరినీ ఈ గదిలో ఇవాళ ఉపవాసాలుంచి చంపుతాను (గది గొళ్లేం బిగిస్తుంది)

సింహా:—(స్త్రీ కంఠంతో) మీ పెళ్లాం - దొంగముండ, తలుపేసింది - నన్ను మాయింటికి దిగబెట్టేయండి. నాకు భయం వేస్తూంది.

సుంద —ఎంత నంగనాచివీ,సంసారికొంపలో ఏమిటి జుట్టుకుందామని వచ్చావు - ఇవాళ మీ యిద్దర్నీ చూడండి ఏం జేస్తానో.

సింహా:—ఏయ్, రాస్కెల్ - నన్ను, నువ్వు ఇలాగ వీధిపెట్టడం ధర్మంకాదు. నే నీపిల్లని అవతలకు పంపించాలి. పాపం చాలాసేపాయి వచ్చింది. కనక వేగం తలుపుతియ్యి.

సుంద:—అయ్యో! అయ్యో! ఎంతవీధి పడిపోయినారండీ - స్వప్నంలో కూడా ఇలాగ

చేస్తారనుకోలేదు. వెధవజన్మ ఛీ - మరెందుకు- ఇదిగో ఇవతల ఉరిపోసుకొని చచ్చిపోతున్నాను.

సింహా:— ......... ......... (తలుపు కన్నంలోంచి ఒక్క-కంటితో వంగి చూచి స్త్రీ కంఠంతో) ఏమండోయ్ మీ ఆవిడ ఉరిపోసుకొని స్వర్గాన్ని అలంకరిస్తుందట. కాస్త కత్తీ, తాడూ, మొదలైన పరికరాలు సప్లయి చేదురూ!

సుంద:—అమ్మ నీ సాహసం మండా ! ఎంత ఆలోచన - నేనచస్తే కులాసాగా ఉందామనుకున్నావా ? నేనంత తెలివిలేనిదాన్ని కాను - చావడానికి.

సింహా.—ఏయ్ - సుందరం - ఏమేనా అంటే నన్ను అను కాని, ఆమెను అనకు. జాగ్రత.

సుంద:—అయ్యో - ఎందుకీ పాడుజన్మ - మొగుడు ముండాకొడుకు ఇంత రౌడీ అయిపోతే ఆడదాని బ్రతుకింతేకదా ? పాపం .. మొగాడట తనయిష్టం వచ్చిన ముండని తెచ్చుకుంటాడట - ఆడది - నేనూ చూపిస్తాను తమాషా ఉండండి...(వీధిలోకి వెళుతుంది)

సింహా:—(తలుపు కన్నంలోంచి చూచి) కొంపతీసి ఏ మొగవెధవనీ తీసుకురాదు కద ? ఇదీ ఒకమేలే - చూదాం దీనిసంగతి.

సుంద:—(లోపలికి వచ్చి, ఎవరితోనో మాటాడుతూ వున్నట్టు) ఓహెూ మోహన్, సమయానికి వచ్చావు - ఎన్నాళ్లకి నీ దర్శనం. నీ ప్రియురాలు సుందరాన్ని మరిచిపోయినావు, లోపలికిరావా ?

సింహా:—(తలుపు కన్నంలోంచి నిదానంగ చూచి) ఎవరూ కనిపించరు...ఇదో గమ్మత్తు.

సుంద —(పురుషకంఠం కోసం ప్రయత్నిస్తూ) మీ ఆయన లేరుకదా? (మామూలుగా) ఆయన ఉంటే ఎంతో లేకపోయినా అంతే.



సింహా.—అబద్ధపు సాక్షిలాగ .....రెండు గొంతుకలూ దీనివే.


సుంద. —(పురుషకంఠంతో) సుందరం-చిన్నప్పుడు నిన్ను చూచాను - ఇప్పుడెంత అందంగా వున్నావు. ఏదీ ఒక్కముద్దు (తన అరచేతిని ముద్దులాడుతుంది)

సింహ:—(తలుపు కన్నంలోంచి చూచి) నా పేరున మరో మాటు ముద్దులాడు. (పకపక నవ్వుతాడు)

సుంద:—నేను తియ్యను.

సింహ:—నువ్వు ఎవడినో మగవాణ్ణి పెట్టుకొని ఉన్నట్టు అనుమానంగా ఉంది. కనక తలుపు తియ్యి.

సుంద:—మీరు ఎవత్తెనో పెట్టుకొని ఉన్నట్టు అనుమానంగా ఉంది. కనక తలుపు తియ్యండి



సుంద.—(పురుష కంఠంతో) ఆ గదులో ఎవరా గాడిద? (సహజంగా) మరెవరు? ఆయనే ..పాపం అందులో ఆయన పజిల్ సాల్వు చేసుకుంటున్నారు. అతనిపని అతనిదీ, మనపని మనదీ ..ఏదీ ఒక్కసారి గట్టిగా నన్ను కౌగలించుకో

సింహ:—(తలుపుకన్నంలోంచి చూస్తూ) తలుపు తియ్యి కావలించుకుంటాను.

సింహ:—నేను తియ్యాను.

సుంద:—నేను తియ్యను.

సింహ:--భర్తమాట భార్య వినాలి కనక నువ్వు ముందుతియ్యి.

సుంద:—ఈరోజుల్లో భార్యమాట భర్త వినాలి కనక ముందు మీరు తియ్యండి.

(ఇంతలో టెలిగ్రాం పట్టుకొని 14 సంవత్సరాల వయస్సుగల టెలిగ్రాఫ్ మేసింజర్

బోయ్, ఒక మహమ్మదీయ బాలుడు వస్తాడు. ఒక కాకీనిక్కరూ, లూజుగా వున్న కాకీకోటూ తలమీద తురకటోపీ)

బోయ్:—(టెలిగ్రాం మీద అక్షరాలుకూడ పలుకుతూ) యర్. సింహాచలం కోర్.

సుంద:—(మాటాడ వద్దని సైగచేసి వాని చేతిలోని టెలిగ్రాం అందుకొని చించి చదివి ఆశ్చర్యంతో – అప్రయత్నంగా) పదివేలే... ఏమండోయ్ తలుపు తలుపు.

సింహా:—ఏమండోయ్ – తలుపు తలుపు.

సుంద:—మీరు ముందు తలుపుతీస్తే 10,000 రూపాయిల ప్రజంటు.

సింహా:—ముందు మీరు తలుపుతీస్తే డిటో

సుంద:—అయితే ఆమాటమీద అలా ఉండండి. ఇదిగో టెలిగ్రాం.

సింహా:—ఎక్కడినుంచి.

సుంద:—బొంబాయి – టైమ్సువాడి దగ్గిర నుంచి.

సింహా:—ఓస్! నిజంగా! అయితే సుందరం ముందు నేను తలుపుతీస్తే బ్రాహ్మణ్ణి కానని ఒట్టేసుకున్నాను కదా ఎలాగ?

సుంద:—నేను మీచేత, తలుపు తీయిస్తానని ప్రతిజ్ఞ చేశాను. పోనీ ఒకలాగ చేదాం ఇద్దరం ఒక్కమారు తీదాం.

సింహా:—బాగుంది కానీ – వన్ – టూ – త్రీ – (ఇద్దరూ తలుపు గొళ్లేలు ఒక్కమారు తీస్తారు. ఇద్దరూ ఒకర్ని లోసుకొని ఒకరు ముందుకి విజృంభిస్తారు. సుందరం గదిలోకి దూరుతుంది)

సింహా:—(చావడిలోకి వచ్చి బాయిని చూచి) ఎవరు నువ్వు – నీపేరు.

బాయ్:—మహబూబాలీ.

సింహా:— మోహన్ కాదూ.

సుంద:—(గదిఅంతా చుట్టబెట్టి వచ్చి) ఏమండోయ్ ఉభయ పాత్రలూ సమర్థతతో నిర్వహించి నందుకు ఇదుగో బహుమానం- (టెలిగ్రాం ఇస్తుంది)

సింహా:—(అందుకొని చదివి) పదేవేలు వెధవది. అరవై వేలు రావలసింది. ప్రైజు పంచేశారు కాబోలు.

సుంద:—అహా! పురుషజన్మకు సంతుష్టి అన్నది లేదుకదా.

సింహా:—అరవై వేలకి పదివేలొచ్చింది.

బోయ్:—తక్కిన యాటికీ వైర్ తెస్తాం, మాకీ రివార్డు దేవ్ జీ.

సింహా:—నీకు రివార్డు యిస్తాను – సుందరం చూశావా పజిల్ పదివేలు తెచ్చింది.

సుంద:—క్రాస్‌వర్డ్ పజిల్ తెచ్చింది.

(తెర)